# మల్లెలు మధురక్షణాలు

"శారదా! అర్జంటుగా రావాలి... టైం ఎంతైందో చూశావా?"

"ఏమిటట తొందర!"

"నా చదువు అయిపోయిందోయ్."

"అయితే..."

"ఇక నీ పనులు పూర్తిచేసుకొని రావచ్చు- అని."

"రాకపోతే ఏమౌతుందట!"

"పొద్దెక్కితే మల్లెలు వాడిపోతయి... వాసనొస్తయ్యా చస్తయ్యా!"

"ఆఁ... తెచ్చారు లేండి మహా మల్లెపూలు."

"వాటికేమైంది... ప్రత్యేకంగా మోండాకెళ్ళి మరీ తెచ్చాను."

"ఆ... మీరు వీటికోసం ప్రత్యేకంగా వెళ్ళి ఉంటారూ? ఎవడో ఏదో కొనటానికి రమ్మనమని ఉంటాడు. ఆయన కోసం వెళ్ళి ఉంటారు. ఆపైన ఆయన ఆ పూలు కొంటూ 'నువ్వూ కొనవా నాయినా' అని ఉంటాడు. ఇక తప్పక కొని ఉంటారు."

"పెద్ద... నేను పూలు కొననట్లు... నువ్వు పెట్టుకోనట్లు... తొందరగా తెముల్చు."

"ఉండండి... ఏమిటాగోల... రేపు మొదటి శుక్రవారం... దేవుడి గూడు దగ్గరన్నా కడగాలా వద్దా?"

"ఒకరోజు ముందు కడుక్కోకపోతే ఆ దేవుడికి కోపం రాదులేవే... రా!"

"ఎవరన్నా వింటే నవ్విపోతారు... చిన్నపిల్లాడిలా ఏమిటా గొడవ... నెత్తికి ముప్పయి ఏళ్లు వచ్చినయి."

"అబ్బా... సరేలేవే... పూలు ఎలా ఉన్నయ్యంటావ్? మరువం గూడా తెచ్చాను చూశావా?"

"చూశారులే సంబడం. ఎల్లుండే పరీక్ష. ఇంకో గంట చదువుకోండి... ఈలోగా నా పనులు పూర్తవుతాయి!"

"ఇంకా గంటేం చేస్తావే!"

"మెడకు తాడేసుకొని ఉరేసుకు చస్తా!"

"లక్ష్మివారం పొద్దు... ఏమిటా వెధవ్వాగుడు?"

"లేకపోతే... నడుములు పట్టుకుపోయి నేను చస్తుంటే ఏమిటి మీ గోల... పనిలో సాయం చేయకపోంగా అడ్డంకులు!"

"ఖర్మరా నాయినా ఖర్మ. పరాయితల్లి కన్నబిడ్డను ఇలా ఏడిపించటం సబబుగాదే!"

"నేనూ అదే అంటున్నాను."

"పాపం!"

"అయ్యో పాపం."

"సరేలే!"

"తెలుగు పాటలు వస్తున్నయ్యల్లే ఉన్నది... పెట్టండి విందాం!"

"మన డ్యూయెట్లు చాల్లే... ఇంకా ఆ రికార్డులెందుకు?"

"పోనీయ్ నేను పాడేదా?"

"పెళ్ళి చూపుల నాడు చూశాగా సంబడం... హార్మోనియం పెట్టె, అమ్మవారి అవతారం."

"అందుకనేనా మా చూరు పట్టుకు పదిహేనురోజులు వేలాడింది!"

"నేనేం గాదు. మీ నాయనే... మా యింటి చుట్టూ చెప్పులరిగేలా తిరిగింది."

"ఆ అరిగిన చెప్పులకోసమే గదా మీ వాళ్ళు కక్కుర్తిపడి పెళ్ళిలో కొట్టేసింది."

"పెళ్ళిలో మీ నాన్న చెప్పులు కొట్టేసింది మావాళ్ళే నంటావ్!"

"ఏమో... అంతా అనుకున్నారు... నాకేం తెలుసు... హమ్మయ్యా! ఇప్పటి కయింది బాబూ... దరిద్రపు గచ్చు... దరిద్రపు గచ్చుని... అద్దె కొంపలకు నాసి రకం రాళ్ళేయక

డబుల్ పాలిష్లు ఎక్కడ ఏస్తారు... ఏసినా ఆలాంటి కొంపల్లో మన మొహాలకు అద్దెకు ఓ గదైనా దొరుకుతుందా అని!"

"చూస్తుండు... అలాంటి ఇల్లే కొనేస్తాను."

"ఈ జన్మలోనేనా?"

"ఏం... ఈ జన్మకేమైంది?"

"ఇల్లొద్దుగాని, నాకో బెంగుళూరు సిల్కు చీర, మన బొట్టి ముండకు కంచిపట్టు జరీ అంచు పరికిణీ పట్టుకు రండి... మీరు ఇల్లు కొన్నంత ఫలం!"

"అంత చేతకాని వాడి ననుకుంటున్నావా నేను."

"ఇల్లు కడగటం అయిందిగాని, కొబ్బరికాయ తెస్తాను అమ్మవార్ని చేస్తారా?"

"ఇప్పుడా?"

"ఏం... ఇప్పుడేమయిందని... ఇప్పుడే చేసి పెట్టండి... పిచ్చిముండ నిద్రలేచిందంటే ఇక మీరు చేసినట్టే!"

"నిద్ర వస్తున్నదే!"

"మా నాన్న ఎంత శ్రద్ధగా చేసిపెట్టేవారో?"

"మీ నాన్నంత ముసలివాణ్ణా ఏం?"

"కాదు. మా నాన్నంత తెలివిగలవారని!"

"మా నాన్న మాత్రం తెలివితక్కువ వాడనుకున్నావా ఏం?"

"మీ నాన్న సంగతి ఎవడికి తెలియదు... అది కొంపలు ముంచే తెలివి!"

"ఎవడి కొంప ముంచాడేం?"

"మా నాన్నది... అందుకనేగా మీ యింట పడింది నేను!"

"ఇక్కడ నీకేం తక్కువయిందట?"

"ఏముందని- అయిదోతనం తప్ప!"

"అదే... ఏం తక్కువయిందీ అంటున్నాను."

"చెప్పాలా వేరే!"

"చెప్పకపోతే ఎలా తెలుస్తుంది!"

"మీ నాన్నని పిలుచుకు రండి చెబుతాను... చెప్పటం కాదు కడిగేస్తాను."

"మధ్యలో ఆయనేం చేశాడు?"

"మీలాంటి వాడిని కన్నందుకు!"

"నాకేమయిందటట. ఆఫీసులో నా అంత మంచి వాడు, తెలివిగల వాడూ లేడని పేరు!"

"ఆడవాళ్ళకా, మగవాళ్ళకా?"

"శాంపిల్‌గా నీ కంటే అందమైన మా టైపిస్టు నడుగు!"

"దానికి పెళ్ళయిందా?"

"నన్ను మించినవాడు దొరికితేనేగాని చేసుకోదట!"

"దొరక్కపోతే మీ పాలిటే పడదుగదా!"

"నువ్వున్నావు గదా మధ్యలో!"

"నాదేముంది లేండి... నాలుగు నిద్ర మాత్రలు పడేస్తే గుటుక్కుమంటాను. మిమ్మల్ని మూడు చెరువుల నీళ్ళు త్రాగించటానికి మా నాయనకేం చేతనవ్వు... అసలే తెలుగు మాస్టారు!"

"పోనీలే ఒక పని చేద్దాం!"

"కొబ్బరికాయ తెమ్మంటారా... పసుపు గూడా కలిపా!"

"మధ్యలో ఆ గోలెందుకు?"

"అమ్మవారిని పట్టుకొని గోలంటారేమిటండీ! కళ్ళు పోతయి... రోడ్డుమీద పడి 'అమ్మా, బాబూ!' అంటూ అడుక్కు తినాలి!"

"అందుకే అన్నాను– అమ్మవార్లని గురించి పొద్దుగూకిం తరువాత మాట్లాడవద్దని."

"మరి పొద్దుగూకితేనే గాని టైపిస్టు అమ్మవారు మీకు గుర్తుకు రాదుగదా!"

"సరే! నేను వదిలినా నువ్వు వదలవుగదా దాన్ని! కానీయ్... మనింట్లోనే ఓ గదిలో ఆమెను వచ్చి ఉండామందామేమిటి!– ఎవ్వరూ లేరట పాపం."

"ఎవ్వరూ లేకపోవటమేం ఖర్మ!... మీరున్నారుగా... ఆరడుగుల మనిషి, అన్నీ ఆ అబ్బ పోలికలే!"

"మానాన్న ఏం అలాంటి వాడు కాదు."

"అంటే తండ్రిని మించిన తనయులన్నమాట!"

"నోర్మూసుకో! ఎవ్వరన్నా వింటే నవ్విపోతారు!"

"ఆ టైపు పిల్లను తెస్తే మిమ్మల్ని చూసే నవ్విపోతారు."

"ఏం నవ్వరు. అసూయతో చూడలేక కళ్ళు పొడుచుకు చావరూ జనమంతా... పెద్దావిడ పాపం తెల్లవార్లూ వంటిల్లు కడుక్కుంటూ ఉంటుంది, చిన్నావిడ మల్లెపూలను వాడనివ్వదూ అని..."

"సంబడమే!"

"ఏం కాక!"

"ఏమండీ... నీరు దిగిన రాళ్ల దిద్దులు నా పెట్టెలో అడుగునున్నయిగాని తీయండి కాస్త."

"అవి దేనికి?"

"అమ్మవారి చెవులకు పెట్టరుటండీ!"

"అసలు సంగతి చెప్పు. వంటింటి తలుపులు వేసి వస్తావా... అమ్మవార్లూ, అయ్యవార్లూ అంటూ అక్కడే మఠం వేస్తావా!"

"అవన్నీ అయితేనే గాని నేను రానండి!"

"దరిద్రపు మొహం... దరిద్రపు మొహం అని... ఒకళ్ళు చెప్పటం, ఇంకొకళ్ళు వినటం లేదు ఈ కొంపలో!"

"అదే నేనూ అంటున్నాను. పక్కింటి సుబ్బారాయుడుగారిని చూడండి... కొబ్బరికాయ పీచు దగ్గరనుంచీ ఆయనే తీస్తాడు."

"నీకు తెలుసో, తెలియదో... వంటిల్లుగూడా ఆయనే కడిగి ముగ్గులు పెడతాడు... ఆడంగిరేకుల వెధవ!"

"అవ్వ! ఏమిటా నోరు... ఆయనగాని విన్నాడంటే చెప్పుచ్చుకు కొడతాడు."

"నువ్వు పరాయి మగవాళ్ళ చేత నన్ను కొట్టిస్తావే? టక్కులాడివి... నిన్నే కొట్టాలి ముందు!"

"కొట్టండి చూద్దాం!"

"కొట్టటం కాదు... నరికి పాతిపెడతాను."

"అందుకేనా పాతిక వేలిచ్చి మీ యింటికొచ్చింది... నరికితే వూరుకుంటారు?"

"ఏం చేస్తావే... ఏం చేస్తావూ అంట!"

"ఇదుగో ఇలా అయితే మీతో ఇంకొక్క క్షణం కాపురం చేయలేను... ఏట్లో దూకి చస్తా!"

"పక్కింటి సుబ్బారాయుణ్ణి తోడు తీసుకెళ్ళు!"

"అమ్మమ్మమ్మ.... ఏం ఆలోచన ఏం ఆలోచన? ఎర్రగా బుర్రగా ఉంటుంది గదా అని... ఆయన ముండమోసిన పెళ్ళాన్ని ఇంట్లో తెచ్చి పెట్టుకుందామనా?"

"నీ నోటికి హద్దూ పద్దూ ఉన్నదా?"

"మీ నోటికి ఉందా ఏం?"

"నువ్వంటే- నువ్వంటావుటే!"

"ఏం అనక... నేనేం తక్కువని!"

"చెంపలు పగలగొడతాను!"

"కొట్టండి చూద్దాం!"

"కొట్టడం గాదే... పళ్లు రాలగొడతాను!"

"రాలగొట్టండి చూద్దాం... ఇదుగో నోరు తెరిచా!"

"శుక్రవారం పొద్దయింది... చేయి లేవటంలేదు... చావుముండ... వెధవ ముండ అని!"

"మీరు బ్రతికుండగా నేనెలా వెధవముండ నవుతాను?"

"ఇస్కో అంటే ఇస్కో అన్నదట వెనకటికో వెర్రి ముండ... అర్ధరాత్రవుతున్నది వంటయింట్లో లైటార్పి తగలడు!"

"ఆర్పుతారు లేండి!"

"తలుపు వేసేయ్!"

"వేస్తారు లేండి!"

"ఏమిటా నీలుగుడు... ఊఁ... వెధవ ఆ కుళ్ళు గుడ్డలు మార్చుకో."

"మా నాన్న రెండొందలు పెట్టి కొన్న చీర కుళ్ళు గుడ్డా? మీ నాన్న ముప్పయి రూపాయిలు పడేసి ఏడుస్తూ కొన్న వెలిసిపోయిన చీర కంచి పట్టు చీరా?"

"వెధవ్వాగుడు వాగావంటే ఈ సారి నిజంగానే వాయిస్తాను- రెండు చెంపలూ ఎడాపెడా!"

"వాయిస్తే వూరుకుంటానా- అట్లకాడ కాలేస్తాను."

"అబ్బో ఇప్పుడు చూడాలే నీ ముఖం... సత్యభామ... అమ్మో... అపర సత్యభామ! లైటార్పు ఇంకెందుకూ...!"

"మీ ముఖం వుందిగా... మన పక్కింటి...."

"పక్కింటీ లేదు వెనకింటీ లేదు. ముందు ఒక్కసారి తలుపులన్నీ చూసొచ్చి లైటార్పు!"

"తలుపులు మీరే చూసుకోండి... నాకు తెలియదు!"

"గాస్ ఆపావా?"

"ఆపకపోతేనే మీకు ఫీడా పోతుంది... రేప్పొద్దున లేచి వెలిగించగానే నేనేగా చచ్చేది!"

"రేప్పొద్దునగా చచ్చేది... ఇప్పుడో మంచి చీర కట్టుకు చావు!"

"కట్టుకుంటారు లేండి. బీరువాలో బండెడు చీరలు మీరు కొన్నవన్నీ పడి మూలుగుతున్నయి గదా! ఏం కట్టుకోమంటారో చెప్పండి!"

"ఎర్రంచు తెల్ల చీర ఉందిగా... అది కట్టుకొని ఏడు... ఆ పూలుగూడా పెట్టుకో!"

"పూలు పెట్టుకో ... పెట్టుకో అంటారే ఎలా పెట్టుకోవాలో తెలిసి ఏడిస్తేగా... దండ కట్టాలా?"

"ఇప్పటిదాకా కట్టనేలేదా?"

"వూళ్ళన్నీ చుట్టి మీ రొచ్చేటప్పటికే ఏడయిందిగా... పిండాకూడు వండి వార్చాలా... కంచాలకు ఎత్తాలా?... ఇంకా పూలెక్కడ కట్టి చావాలి."

"సదేలే... పంచాంగం విప్పకుండా పూలు కట్టటం మొదలు పెట్టు... బుజ్జిముండ లేచి కూర్చున్నదంటే- మళ్ళా తెల్లవారితేగాని నిద్రపోదు!"

"అప్పుడుగాని అయ్యగారి తిక్క కుదర్దు!"

"ఎందుకా నవ్వు?"

"ఆ దయ్యం ముండ లేస్తే ఎంత బాగుంటుందో నని!"

"మళ్ళా నవ్వావంటే గొంతు పిసుకుతా!"

"ఏ మగాడయినా పడగ్గదిలో పెళ్ళాం నవ్వాలనుకుంటాడుగాని, ఇదెక్కడ చోద్యమండీ... నన్ను నవ్వద్దంటారు!"

"నవ్వావులే గాని... కట్టిన పూలు చాలు పెట్టుకో... మిగతా నాలుగూ మన చిన్నముండకుంచు. పొద్దున్నే నీళ్ళు పోసుకున్న తరువాత పెట్టుకుంటుంది."

"హమ్మయ్య! పూల గోల అయింది... చీర మార్చాలా... లేక..."

"అహఁ... తప్పదు! ప్లీజ్... లే!"

"ఇవాళ్టికి ఫరవాలేదులేండి సార్... ఇప్పటికే పొద్దుబోయింది."

"ఉఁహూ... లాభం లేదు, మేడమ్!"

"ఖర్మ! లైటార్పండి మరి!"

"నేను కళ్ళు మూసుకుంటాను గాని, కట్టేసుకోవే... నువ్వో చాదస్తం!"

"అబ్బ! ఆశ! పక్కగదిలో కట్టుకు వస్తానుగాని... మన బంగారుముండ లేస్తుందేమో... చిచ్చికొడుతూ కూర్చోండి!"

"అది లేవకుండా వుండాలేగాని... ఎంతసేపయినా చిచ్చికొడుతూ కూర్చుంటాను! చేతులు నొప్పి పుట్టినా సరే!"

"సంతోషించాం తెలివికి!"

"నీ బోడి తెలివికంటే నయమేలే నేను!"

"ఇదుగో నన్నేమన్నా అన్నారంటే దాన్ని గిచ్చి మరీ లేపుతాను!"

"నీకు దణ్ణం పెడతాను గాని, పోయిరావే వెధవ గోల!"

"ఆలా దారికి రాండి!"

"హాయిహాయిగా... అహహా... దీన్దుంపతెగ ఈ ముండ ఇప్పుడే లేచి కూర్చునేలా ఉన్నది... ఇదొకటి పానకంలో పుడకలాగా... పగలంతా నిద్ర, రాత్రంతా ఏడుపు!"

"లేచిందా?"

"కలవరమాయే మదిలో...నా మదిలో..."

"హత్య...ఖూనీ..."

"ఎక్కడేవ్...మధ్యలో ఇప్పుడదెక్కడ?..."

"నా కిష్టమయిన పాటను నిలువునా ఖూనీ చేస్తున్నారు కదండీ!"

"లలల...లలల...లలలా..."

"ఏమిటా పిచ్చిగోల... పిల్లముండ లేచేను!"

"సంతోషించారులే... లైటార్పు!"

"మీరే అర్పండి... దీపాలార్పటం మా ఇంటా వంటా లేదు!"

"చిత్తం! అలాగే... ఏం చేస్తాను! అవసరం నాది!"

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక: 20. 06. 1984)*